Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

విశ్లేషణ

# భారత రైతుపై పెప్సీ దొంగ దెబ్బ

బి తులసీదాస్

గుజరాత్ బంగాళదుంప రైతులు తమకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలంటూ పెప్సీ కంపెనీ వేసిన కేసు దేశమంతటా చర్చనీయాంశంగా వుంది. సాధారణ రైతులపై ఒక పెద్ద బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సి) కోర్టుకెక్కడం అసాధారణ పరిణామం. అందువల్ల భారత్ లోనే గాక ప్రపంచమంతటా ఇది చర్చనీయాంశం అవుతోంది. ఈ పరిణామాలను ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ 'రాయిటర్స్' క్రమం తప్పకుండా అందిస్తోంది. రైతు తన పొలంలో పండించిన పంట నుండి విత్తనాన్ని తిరిగి ఉపయోగించడం నేరమని చెప్పే ఈ దారుణమైన కేసు పూర్వాపరాలను పరిశీలిద్దాం.




**నిర్నిబంధమైన రీతిలో రైతులకు ప్రతికూలంగా వాటిని ఉపయోగించడాన్ని మాత్రం చట్టం అనుమతించదు. సెక్షన్ 39(1V) ప్రకారం రైతు తన పొలంలో పండించిన పంటను (పేటెంట్ చేసిన రకాలతో సహా) దాచుకోవడానికి, వాడుకోవడానికి, విత్తడానికి, తిరిగి విత్తడానికి (సో అండ్ రీ సో), మారకం చేసుకోవడానికి, పంచుకోవడానికి, అమ్ముకోవడానికి హక్కులున్నాయి. అయితే ఆ ఉత్పత్తిని (విత్తనాన్ని) ఒక బ్రాండ్‌గా అమ్మడానికి మాత్రం వీలు లేదు. అంటే బ్రాండ్ పేరుతో అమ్మనంతకాలం ఏ విత్తనాలనైనా రైతులు సాగు చేసుకోవటానికి అవకాశం ఉంది. కాబట్టి 64, 65 సెక్షన్ల ప్రకారం ఏదైనా మరో కంపెనీ లేదా వ్యాపార సంస్థపై కేసు నమోదు చేయవచ్చు తప్ప రైతుపై అలాంటి అభియోగం మోపేందుకు ఆస్కారమే లేదు.**

## ఏమిటీ కేసు?

ప్రపంచం లోని అతి పెద్ద ఆహార, పానీయ ప్రోసెసింగ్ కంపెనీల్లో ఒకటైన అమెరికాకు చెందిన పెప్సీ మన దేశంలో 1989 నుండి కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రపంచవ్యాప్త వ్యాపారం ద్వారా గత ఏడాది పెప్సీ పొందిన ఆదాయం 6,500 కోట్ల డాలర్లు (రూ.4.52 లక్షల కోట్లు). రెండేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మొత్తానికి సమానమన్న మాట. భారత్‌లో 38 పానీయాల (బెవరేజ్) ప్లాంట్లు, మూడు ఆహార ప్లాంట్లు వున్నాయి. ఆక్వాఫినా నీళ్లు, పెప్సీ, 7 అప్, ట్రోపికానా తదితర శీతల పానీయాలు, లేస్ చిప్స్, కుర్కురే తదితర ఆహార ఉత్పత్తులు ఈ కంపెనీవే. ఆ లేస్ చిప్స్ తయారీకి ఉపయోగించే బంగాళదుంప విత్తనం ఎఫ్‌ఎల్ 2027ను (సాధారణంగా ఎఫ్‌సి5 అంటారు) తాము పేటెంట్ చేశామనీ ఆ రకాన్ని తమ అనుమతి లేకుండా ఎవరూ పండించరాదనీ, దాన్ని అమ్మరాదనీ పెప్సీ వాదిస్తోంది. గుజరాత్‌లో బంగాళదుంపలు పండించే రైతుల వివరాలు సేకరించడానికి ప్రైవేటు డిటెక్టివ్‌లను నియమించి, వారితో గూఢచారి చర్యలు జరిపించింది. ఆ ప్రైవేటు డిటెక్టివ్‌లు పంటను కొనే దళారీల వేషంలో వెళ్లి శాంపిల్స్ తీసుకున్నారు. రహస్యంగా వీడియోలు చిత్రీకరించారు. అన్ని వివరాలు సేకరించిన పెప్సీ ఆ రైతులు తమకు పరిహారంగా ఒక కోటి ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని అహ్మదాబాద్ కోర్టులో కేసు ఫైల్ చేసింది. ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ చట్టం (పిపివిఎఫ్‌ఆర్‌ఎ) ప్రకారం ఆ రైతులు శిక్షార్హులని అభియోగం మోపింది. ఏప్రిల్ 6న విచారించిన కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులిస్తూ కేసును 26కు వాయిదా వేసింది.

## పిపివిఎఫ్‌ఆర్‌ఎ మతలబు

ఈ చట్టం పేరు చూస్తే రైతులకు, ప్లాంట్ వెరైటీలకు రక్షణ కల్పించడంలా అనిపిస్తోంది. కాని ఆచరణలో అది దేశీయ రైతులను అదుపాజ్ఞలలో పెట్టుకోవడానికి ఎంఎన్‌సిలకు ఉపయోగపడుతోందని ఇప్పుడు స్పష్టమవుతోంది. ఆ చట్టం 2001 అక్టోబర్ 30న రాష్ట్రపతి ఆమోదం పొందింది. బిజెపి పాలనలో రూపు దిద్దుకున్న ఆ చట్టానికి మాతృక కాంగ్రెస్ హయాంలో ఈ దేశంపై రుద్దబడిన డబ్ల్యుటిఒ షరతుల్లో వుంది. కాబట్టి ఇప్పుడు రైతాంగం ఎదుర్కొంటున్న ఈ సమస్యకు బిజెపి, కాంగ్రెస్ రెండూ బాధ్యత వహించాలి. మన దేశంలో విత్తన, ఔషధ రంగాలకు, సాంకేతిక పురోగతికి, సామాన్యుల ప్రయోజనాల రక్షణకు ఇండియన్ పేటెంట్ చట్టం (1970) ఎంతగానో తోడ్పడింది. కాని నయా ఉదారవాద విధానాల అమలు, డబ్ల్యుటిఒ నిబంధనలు, ఎంఎన్‌సిల ఒత్తిడితో పాలకులు దానికి తిలోదకాలిచ్చి ఈ పిపివిఎఫ్‌ఆర్‌ఎ లాంటి అనేక చట్టాలు తీసుకొచ్చారు. డంకెల్ ప్రతిపాదనల పేరిట వచ్చిన ఇలాంటి దుష్ట ప్రతిపాదనలను తొలి నుండీ వామపక్షాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు సాగాయి. ఆ క్రమంలోనే పాలక వర్గాలు అటు ఎంఎన్‌సిల ఒత్తిడికి లొంగుతూనే, ఇటు ప్రజా ఉద్యమాల తాకిడిని ఎదుర్కోలేక తిప్పలు పడుతూనే చట్టాలు చేశాయి. నిజానికి పిపివిఎఫ్‌ఆర్‌ఎలో కాటు వేయడానికి ఎంఎన్‌సిలకు అనేక కోరలు కల్పించడంతో పాటు రైతుల రక్షణకు కొన్ని క్లాజులున్నాయి.

తమ ఎఫ్‌ఎల్2027 బంగాళదుంప విత్తనాన్ని పిపివిఎఫ్‌ఆర్‌ఎ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించామని, ఆ వెరైటీని తమ అనుమతి లేకుండా పండించడం ఆ చట్టం లోని 64,65 సెక్షన్ల ప్రకారం శిక్షార్హమని పెప్సీ అభియోగం. ఏదైనా ఒక వెరైటీని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి, అంటే పేటెంట్ చేయించుకున్న సంస్థకు లేదా వ్యక్తికి చట్టం అలాంటి అధికారాలిస్తోంది. అయితే అంత నిర్నిబంధమైన రీతిలో రైతులకు ప్రతికూలంగా వాటిని ఉపయోగించడాన్ని మాత్రం చట్టం అనుమతించదు. సెక్షన్ 39(1V) ప్రకారం రైతు తన పొలంలో పండించిన పంటను (పేటెంట్ చేసిన రకాలతో సహా) దాచుకోవడానికి, వాడుకోవడానికి, విత్తడానికి, తిరిగి విత్తడానికి (సో అండ్ రీ సో), మారకం చేసుకోవడానికి, పంచుకోవడానికి, అమ్ముకోవడానికి హక్కులున్నాయి. అయితే ఆ ఉత్పత్తిని (విత్తనాన్ని) ఒక బ్రాండ్‌గా అమ్మడానికి మాత్రం వీలు లేదు. అంటే బ్రాండ్ పేరుతో అమ్మనంతకాలం ఏ విత్తనాలనైనా రైతులు సాగు చేసుకోవటానికి అవకాశం ఉంది. కాబట్టి 64, 65 సెక్షన్ల ప్రకారం ఏదైనా మరో కంపెనీ లేదా వ్యాపార సంస్థపై కేసు నమోదు చేయవచ్చు తప్ప రైతుపై అలాంటి అభియోగం మోపేందుకు ఆస్కారమే లేదు. సరిగ్గా ఈ క్లాజునే గుజరాత్ రైతులు, అఖిల భారత కిసాన్ సభ ముందుకు తెచ్చాయి. రైతులపై కేసు వేయడం ద్వారా పెప్సీ కంపెనీ చట్ట ఉల్లంఘనకు పాల్పడిందని ఎఐకెఎస్ నాయకత్వాన రైతులు దేశ వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు.

## తోక ముడుస్తుందా? నటనా?

చట్టంలో రైతుకు రక్షణ కల్పించే బలమైన క్లాజులుండడం, దేశమంతటా ప్రజల నుండి వ్యతిరేకత రావడంతోపాటు అంతర్జాతీయంగా కంపెనీకి చెడ్డ పేరు రావడంతో పెప్సీ ఇప్పుడు కొత్త ఎత్తు వేసినట్టు కనిపిస్తోంది. కేసును పరిష్కరించుకునేందుకు కంపెనీ ఏప్రిల్ 26 వ తేదీన రాజీ ప్రతిపాదన చేసింది. రైతులు, లేస్ చిప్స్‌లో ఉపయోగించే రిజిస్టర్డ్ బంగాళాదుంప రకం సాగు చేయకుండా కట్టడి చేయటానికి కూడా కొత్త ఎత్తు వేసినట్టుంది. 'రైతులు తమ రిజిస్టర్డ్ బంగాళాదుంపల వెరైటీ ఎఫ్‌సి5ను ఉపయోగించరాదు. వారి వద్దనున్న ప్రస్తుత స్టాకును నాశనం చేయాలి. లేదా పెప్సీకో వ్యవసాయ గ్రూపుల్లో చేరి కంపెనీ నిబంధనలను పాటించాలి.' అని షరతులు విధించింది. రైతుల తరపు న్యాయవాది పెప్సీ ప్రతిపాదనను పరిశీలించటానికి సమయం కావాలని కోరారు. కేసు తదుపరి విచారణ జూన్ 12 కు వాయిదా పడింది. ఇంత జరిగాక పెప్సీ కంపెనీకి ఏమాత్రం ప్రమాణాలున్నా రైతులపై కేసును బేషరతుగా ఉపసంహరించుకోవాలి. ఇంకా కొత్త షరతులు విధించాలని ప్రయత్నిస్తే కుదరదు. వెనక్కు తగ్గుతున్నట్టు నటించి రైతులను మోసగించాలన్న కుయుక్తి కూడా వుండవచ్చు. అన్నదాతలు అప్రమత్తంగా వుండాలి. ఎందుకంటే ఇది కేవలం గుజరాత్ లోని ఆ ఐదుగురో పది మంది రైతులకు మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. యావత్ భారత రైతులకు, తమ విత్తన హక్కులకూ సంబంధించిన అంశం. దేశం లోని రైతులపై, పంటలపై, ఆదాయాలపై, ఆహార భద్రతపై, దేశ సార్వభౌమాధికారంపై ఈ కేసు విస్తృతమైన ప్రభావాన్ని చూపుతుంది. పేటెంట్ల పేరిట ఎంఎన్‌సిలు భారత్‌తో సహా అనేక వర్ధమాన దేశాలపై పెత్తనం చేయాలని ప్రయత్నిస్తున్నాయి. ప్లాంట్ వెరైటీల్లో అత్యధికం ఈ దేశాల్లోనే వుండగా పేటెంట్లలో 95 శాతం ఎంఎన్‌సిల గుప్పిట్లో వుండం గమనార్హం.

రైతులకు వ్యతిరేకంగా ఈ కేసులో తీర్పు వచ్చిందంటే గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంతేగాక దాన్ని ఆసరా చేసుకొని భారత రైతాంగంపై బహుళ జాతి సంస్థలు స్వారీ చేస్తాయి. ఇది ఒక టెస్ట్ కేసు లాంటిది. రైతులు, రైతు సంఘాలు, దేశభక్తియుత శక్తులు, ప్రజాస్వామ్యవాదులంతా అప్రమత్తంగా ఉండి రానున్న ప్రమాదాన్ని నివారించాలి. వేల కోట్ల రూపాయల వ్యాపారం చేసే పెప్సీ, మోన్‌సాంటో, డుపాంట్, బేయర్ లాంటి బడా కంపెనీల కోర్టు లిటిగేషన్లను సామాన్య రైతులు ఎదుర్కోవడం కష్టమే! కోర్టు వాయిదాలు, విచారణలు, లాయర్ల ఫీజులు 3–4 ఎకరాల రైతు తట్టుకోవడం దుర్లభమే. తిమ్మిని బమ్మిని చేసే మోసకారి న్యాయవాదులున్నారు. అలాగే కాసులకు కక్కుర్తిపడే న్యాయమూర్తులూ కొందరుండవచ్చు. అయితే ఇలాంటి విపత్కర చట్టాలను, వాటి పర్యవసానాలను రైతాంగం సామూహికంగానే ఎదుర్కోవాలి. పెప్సీ లాంటి బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తుల అమ్మకం ద్వారా దోపిడీ ఇంకా ఎక్కువగా చేస్తున్నాయి. వాటి నాణ్యతా ప్రమాణాలూ ప్రశ్నార్థకమే! ఆ ఉత్పత్తుల అమ్మకాలపై దెబ్బ తీస్తే తప్ప వారు దారికి రారు. కాబట్టి కొన్ని ప్రజా సంఘాలు పిలుపిచ్చినట్టు పెప్సీ ఉత్పత్తులు వేటినీ ప్రజలు కొనకుండా వుంటే ఆ కంపెనీ దారికి రాక తప్పదు. సంఘటిత ఉద్యమం, పోరాటమే మన ముందున్న మార్గం. తద్వారా చట్టాలను, వాటి అమలులో రైతాంగ ప్రయోజనాలు పరిరక్షించేలా ప్రభుత్వాలనూ దారికి తేవాలి.